RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక





సంపుటి - 01 సంచిక - 304 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్ శుక్రవారం 12 జూలై 2024

# వెంకన్న సాక్షిగా చెబుతున్నా.. జగన్ ను వదిలేప్రసక్తే లేదు.!

**కేంద్ర మంత్రి బండిసంజయ్**

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్**



ఆంధ్ర ప్రగతి తిరుమల జూలై 11: :గత వైసీపీ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. స్వామి వారిపై భక్తి లేని వారు నామాలు పెట్టుకుని... స్వామికి, టీటీడీ ఆస్తులకు పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. ఇతర మతస్తులకు అధికారాన్ని అప్పగించి తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేశారని దుయ్యబట్టారు. గత ఐదేళ్లు వీరప్పన్ వారసుల చేతిలో టీటీడీ పాలన సాగిందని సంజయ్ అన్నారు. ఎర్రచందనం కొల్లగొట్టి వేల కోట్లను సంపాదించారని చెప్పారు. ఎర్ర చందనం స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని... వారిని వదిలి పెట్టబోమని అన్నారు. వేంకటేశ్వరస్వామి వారి దయ, భిక్షతో కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు. ఈరోజు బండి సంజయ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ తో పాటు పలువురు బీజేపీ నేతలు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి హోదాలో స్వామి వారిని బండి సంజయ్ దర్శించుకోవడం ఇదే తొలిసారి.

# 2026 నాటికి భోగాపురం

**ఈ బాధ్యత రామ్మోహన్ నాయుడి పైనే ఉంది: చంద్రబాబు**

**భోగాపురం విమానాశ్రయంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్న సీఎం**

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్న చంద్రబాబు**

**విమానాశ్రయం పూర్తయితే ఎకనమిక్ జోన్‌గా మారుతుందని వెల్లడి**



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11: ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదన్న సీఎం 2026 నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశను పూర్తి చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఎయిర్ పోర్ట్ పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీనిని పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుపై ఉందన్నారు. హెలికాప్టర్ ద్వారా విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్నారు. ఈ ప్రాంతానికి భోగాపురం గ్రోత్ ఇంజిన్‌గా పని చేస్తుందన్నారు. విమానాశ్రయం పూర్తయితే ఈ ప్రాంతం ఎకనమిక్ హబ్‌గా మారుతుందన్నారు. చుట్టుపక్కల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. భోగాపురం వరకు బీచ్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడానికి భోగాపురంకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీని పెంచాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఎన్నో అంశాలు మళ్లీ మొదటికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ప్రారంభంలోనే 48 లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. భోగాపురం విమానాశ్రయానికి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనుమతులు వచ్చాయన్నారు.

అప్పుడు ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర అద్భుత విజయాన్ని అందించిందని... ఇలాంటి ప్రాంతానికి ఏదైనా చేయాలన్నారు. అందువల్లే జిల్లా పర్యటనలలో భాగంగా తొలుత ఉత్తరాంధ్రకే వచ్చానన్నారు.

# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ..!

-రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఐఏఎస్ అధికారులు బదిలీ

-ఐఏఎస్‌లతో పాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులను కూడా బదిలీ




2లో

# గ్రామాలలోని రహదారులకు మహర్దశ.!

**-రూ.4,976 కోట్లు నిధులతో 7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక.**

-250 మించి జనాభా కలిగిన ప్రతి గ్రామానికీ రహదారి అనుసంధానం.

-మ్యాచింగ్ గ్రాంటు 10 శాతానికి తగ్గించేలా కేంద్రంతో మాట్లాడుతాం.

-పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11: గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రూ.4,976 కోట్లు నిధులతో 7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలకు చురుగ్గా కార్యరూపం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం వల్ల పేదరిక నిర్మూలనతోపాటు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయనే విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలన్నారు.**మిగతాది 2లో...**

# రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్.!



-స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు

-సియం ఎన్నికల వాగ్దానంలో భాగంగా నిధులు విడుదల.

2లో

# వైసీపీ ప్రోద్బలంతోనే ఆ కథనం ప్రచురించారు : నారా లోకేశ్.!



-విశాఖ స్టీల్ ప్లాంట్ పై డెక్కన్ క్రానికల్ లో కథనం.

-ఈ కథనాన్ని తాము ప్రతి ఒక్కరి దృష్టికి తీసుకెళ్లాలనుకుంటున్నామని లోకేశ్ వెల్లడి.

విశాఖ బ్రాండ్ ఇమేజిని నాశనం చేయడానికే కథనం తీసుకువచ్చారని ఆగ్రహం.

2లో

# ఏపీలో మరో పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధం

**-తల్లికి వందనం పథకానికి సంబంధించి ఆదేశాలు.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఇప్పటికే పింఛన్లు పెంచి పంపిణీ చేయగా.. మెగా డీఎస్సీ కసరత్తు మొదలైంది.. అన్న క్యాంటీన్ల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. తాజాగా మరో హామీకి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు.. తల్లికి వందనం పథకానికి సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే విద్యార్థులకు అందజేసే స్టూడెంట్ కిట్‌కు సంబంధించి కూడా క్లారిటీ ఇచ్చారు.కొత్త ప్రభుత్వంలో పథకాల (తల్లికి వందనం, స్టూడెంట్ కిట్) పేర్లు మారడంతో ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. . చంద్రబాబు సర్కార్ ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అమ్మకు వందనం పేరుతో ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. అలాగే స్టూడెంట్ కిట్ ఇప్పటికే పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అయితే తల్లికి వందనం, స్టూడెంట్ కిట్ పథకాలకు సంబంధించి.. తప్పనిసరిగా ఆధార్ కలిగి ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఒకవేళ ఎవరికైనా ఆధార్ కార్డ్ లేకపోతే.. వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. విద్యాశాఖ ద్వారా ఆధార్ నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. అయితే ఆధార్ వచ్చే వరకు 10 రకాల పత్రాలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది. ఆధార్ వచ్చే వరకు ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు లేదా తపాలా పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్సు, ఉపాధి పథకం కార్డు, కిసాన్ పాస్‌బుక్, వ్యక్తిని ధ్రువీకరిస్తూ గెజిటెడ్ అధికారి సంతకం చేసిన పత్రం, తహసీల్దారు ఇచ్చే పత్రాలను, మరో పత్రం.. ఇలా పలు డాక్యుమెంట్లను అనుమతిస్తారని తెలిపారు. అమ్మకు వందనం పథకానికి సంబంధించి.. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, స్కూళ్లకు పిల్లల్ని పంపించే తల్లులు లేదా సంరక్షకులకు ఏడాదికి రూ. 15 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. స్టూడెంట్ కిట్ కింద ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు, ఆంగ్ల డిక్షనరీ, మూడు జతల యూనిఫామ్, బెల్టు, జత బూట్లు, రెండు జతల సాక్సులు అందజేస్తున్నారు.

# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ..

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11:
రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఐఏఎస్? అధికారులు బదిలీ అయ్యారు. 19 మంది ఐఏఎస్?లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్? కుమార్ ప్రసాద్? గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్?లతో పాటు మరో ఇద్దరు ఐపీఎస్? అధికారులను కూడా బదిలీ చేశారు.
రాష్ట్రంలో 19 మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అనంతరాము ను అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గా ఆర్.పి. సిసోడియా కు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. జి.జయలక్ష్మి కి సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. కాంతిలాల్ దండే ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా బదిలీ అయ్యారు. సురేశ్ కుమార్ ను పెట్టుబడులు మౌలిక సదుపాయాల కార్యదర్శి , గ్రామవార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ కార్యదర్శిగానూ సురేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సౌరభ్ గౌర్ ఐటీశాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. యువరాజ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి గా హర్షవర్ధన్ మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. పి.భాస్కర్ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యదర్శి, ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలు అప్పగించింది.

కె.కన్నబాబు సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గానూ బాధ్యతలు అప్పగించింది. వినయ్‌చంద్ పర్యాటకశాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వివేక్ యాదవ్ యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శి గా నియమించింది. సూర్యకుమారి మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సి.శ్రీధర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. జె.నివాస్ ఆర్థికశాఖ అదనపు కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. విజయరామరాజు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. హిమాంశు శుక్లా సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ గా నియమించింది. ఢిల్లీరావు వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. వ్యవసాయశాఖ నుంచి హరికిరణ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. హరీశ్‌కుమార్ గుప్తా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ డీజీగా బదిలీ చేసింది. కుమార్ విశ్వజిత్ హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. గిరిజాశంకర్ ను ఆర్థికశాఖ నుంచి రిలీవ్ చేసింది.

# రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్.!

ఆంధ్ర ప్రగతి అమరావతి, జూలై11:
రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక,వాణిజ్య,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన మొదటి సంతకం చేశారు.ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయం రెండవ భవనంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య పూజా కార్యక్రమాల అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15 ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ దస్త్రంపై తొలి సంతకం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ గ్రామ పంచాయితీలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్,కార్యదర్శులు డా.కెవివి. సత్యనారాయణ,జానకి, వినయ్ చంద్,చీఫ్ కమీషనర్ స్టేట్ ట్యాక్సెస్ గిరిజా శంకర్ ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరి కె.ఆదినారాయణ,డైరెక్టర్ ట్రెజరీస్ మోహన్ రావు,ఎపి జిఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు మంత్రి వర్యులకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఇంకా ఈకార్యక్రమంలో పలువురు సంబంధిత శాఖల అధికారులు,ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రోద్బలంతోనే ఆ కథనం ప్రచురించారు

## : నారా లోకేశ్.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11:
విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఏపీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకుంటోంది అంటూ డెక్కన్ క్రానికల్ పత్రికలో వచ్చిన కథనంపై తీవ్ర దుమారం రేగుతోంది. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. డెక్కన్ క్రానికల్ పత్రికలో వచ్చిన కథనాన్ని తాము ప్రతి ఒక్కరి దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నామని తెలిపారు. అలజడి సృష్టించడానికి, విశాఖపట్నం బ్రాండ్ ఇమేజిని నాశనం చేయడానికి వైసీపీ ప్రోద్బలంతో ప్రచురించిన స్వచ్ఛమైన పెయిడ్, కల్పిత కథనం అని లోకేశ్ వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం అందిస్తామని ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలో మడమ తిప్పడం అనేదే లేదని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో మేం మాట ఇచ్చాం... నిలబెట్టుకుంటాం అని ఉద్ఘాటించారు. మన రాష్ట్రం నాశనం అవ్వాలని కోరుకుంటున్న బ్లూ మీడియా సృష్టించిన ఈ ఫేక్ న్యూస్ ను నమ్మవద్దని ఏపీ ప్రజలను కోరుతున్నానని తెలిపారు.వైజాగ్ లో డెక్కన్ క్రానికల్ కార్యాలయం డిస్ ప్లే బోర్డుపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరుతున్నానని తెలిపారు. నిరాధార, పక్షపాత ధోరణితో కథనాలు ప్రచురించే బ్లూ మీడియా సంస్థలపై తాము న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గ్రామాలలోని రహదారులకు మహర్దశ.!

(మొదటి పేజి తరువాయి)
గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత కోరదామని చెప్పారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు (ఎ.ఐ.ఐ.బి.) అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఎ.ఐ.ఐ.బి అధికారులు ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్టు గురించి పవన్ కళ్యాణ్ కి వివరించారు. 250కి మించి జనాభా కలిగిన ప్రతి గ్రామానికి రహదారుల అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొదలైన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన రహదారుల నిర్మాణం సాధ్యపడుతుందని చెప్పారు. నెలకు రూ.200 కోట్లతో రహదారుల నిర్మాణం చేపడితే ఈ ప్రాజెక్టులో అద్భుతమైన పురోగతి ఉంటుందని తెలిపారు. అందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 75 కోట్ల మ్యాచింగ్ గ్రాంటు సమకూరిస్తే బ్యాంకు రూ.125 కోట్ల రుణం మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో జాప్యం
ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గత ప్రభుత్వం హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ ప్రక్రియ కుంటుబడింది. ఆ సమస్యను పరిష్కరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యతతో కూడిన రహదారులు అందుబాటులోకి వచ్చేవి. తద్వారా గ్రామీణ అభివృద్ధి సాధ్యపడేది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారి ప్రాజెక్టు ద్వారా రహదారుల నిర్మాణం, నిర్వహణ సక్రమంగా సాగేలా చూడాల్సిన బాధ్యత మేం తీసుకుంటాం. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం పనుల్లో పారదర్శకతను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సమీక్షించేందుకు ప్రత్యేక పోర్టల్ అభివృద్ధి చేయాలి. ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు వీలుగా ఆ పోర్టల్ లో ప్రత్యేక కాలమ్ పొందుపర్చాలి. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన 30 శాతం మ్యాచింగ్ గ్రాంటును 10 శాతానికి తగ్గించే విధంగా అవసరమైన మార్పులు చేయాలని కేంద్రం ప్రభుత్వాన్ని కోరతామ"న్నారు. ఈ సమావేశంలో ఎ.ఐ.ఐ.బి. అధికారులు ఫర్హాద్ అహ్మద్, డా.అశోక్ కుమార్, శివరామకృష్ణ శాస్త్రి, పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలూ నాయక్, ఏపీఆర్‌ఆర్పీ అధికారులు సి.వి.సుబ్బారెడ్డి, పి.వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఏపిలో సర్పంచ్ లకే మళ్ళీ అధికారం..?

**-గ్రామ పంచాయతీలతో సచివాలయాలు అనుసంధానం.**
**-తద్వారా గ్రామాల అభివృద్ధి. -ప్రయత్నాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం.**

ఆంధ్ర ప్రగతి అమరావతీ జులై 11:
గ్రామ పంచాయతీలకు మళ్ళీ మంచిరోజులు రానున్నాయి. సర్పంచ్‌లకు మళ్లీ అధికారాలు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు గ్రామ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో గ్రామ పంచాయతీలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు మంజూరైన 14, 15 ఆర్థికసంఘం నిధులను వైసీపీ సర్కారు ఇతర అవసరాలకు దారిమళ్లించేది. దీంతో పాలక వర్గాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని యోచిస్తోంది.
సచివాలయాలను గ్రామ పంచాయతీలతో అనుసంధానం చేసేలా అడుగులు వేస్తోంది. సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు అప్పగించాలని భావిస్తోంది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 647 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో మరో 75 సచివాలయాలు (ఇచ్ఛాపురం-10, పలాస-16, ఆమదాలవలస-11, శ్రీకాకుళం-38)ఉన్నాయి. అయితే, ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు వెళ్లకుండా సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. సచివాలయాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు ఉన్నా అందులో పనిచేసే ఉద్యోగులు వారి పరిధిలో లేకుండా పోయారు. వాటి పర్యవేక్షణను రెవెన్యూ శాఖకు అప్పగించింది గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం. కనీసం పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేయడానికి కూడా అభ్యంతరాలు తెలిపింది. తమకు హక్కులు




కల్పించాలని సర్పంచ్‌లు పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కాని ఇటు పంచాయతీ కార్యదర్శులు గాని ఏమీ చేయలేకపోయారు.నిధుల ఖర్చు విషయంలో జగన్ సర్కారు కట్టడి చేయడంతో పంచాయతీల్లో కనీస వసతులు సమకూర్చడానికి ఆపసోపాలు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలను సకాలంలో చెల్లించలేకయారు. చిన్నచిన్న మరమ్మతు పనులకు బిల్లులు ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదాయం ఉన్న పంచాయతీలదీ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో పంచాయతీ వ్యవస్థకు గత వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను పంచాయతీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సర్పంచ్‌లకు అధికారం అప్పగించడం ద్వారా గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటు లోకి తెచ్చేలా అడుగులు వేస్తోంది.



# అన్న పార్లమెంటుకు. తమ్ముడు అసెంబ్లీకి

# పోటీకి సై..?



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 11:
గత కొన్ని రోజులుగా మీడియా, సోషల్ మీడియాలో జగన్ పులివెందుల శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తారనీ, కడప లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనీ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.ఇందు కోసం జగన్ కడప లోక్ సభ సభ్యత్వానికి అవినాష్ రెడ్డి చేత రాజీనామా చేయించి, ఆయనను తాను రాజీనామా చేసిన పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి రంగంలోకి దింపుతారన్నవార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలకు వైసీపీ నుంచి కానీ జగన్ నుంచి కానీ ఎటువంటి స్పందనా లేదు. పార్టీ వర్గాలు జగన్ కడప నుంచి లోక్ సభకు ఎన్నిక కావాలన్న ఉద్దేశంతోనే ఉన్నారనీ, అలా అయితేనే తనకు తన అక్రమాస్తుల కేసులను డిఫెండ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారనీ అంటున్నారు. అయితే కొంచం లాజిక్ తో ఆలోచిస్తే జగన్ పులివెందుల అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేసి కడప నుంచి లోక్ సభకు పోటీ చేస్తే అక్కడ గెలుస్తారా.?
అలాగే అవినాష్ రెడ్డి పులివెందుల అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తే ఆయనకు విజయం సాధించే అవకాశాలు ఉంటాయా? ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఉప ఎన్నికలలో సహజంగానే అధికారంలో ఉన్న పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. దానికి తోడు తాజా ఎన్నికలలో పులివెందులలో జగన్ మెజారిటీ బాగా తగ్గింది.
అలాగే కడప లోక్ సభ నియోజకవర్గంలో జగన్ కు పోటీగా కాంగ్రెస్ అభ్యర్థి, సొంత చెల్లెలు షర్మిల రంగంలోకి దిగడం ఖాయం. అటువంటప్పుడు జగన్ ఆమెను నేరుగా ఢీకొని గెలవగలరా? తాజా ఎన్నికలలో కడప జిల్లాలో తెలుగుదేశం అద్భుత ప్రదర్శన కనబరిచింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది.
ఇప్పుడు అధికారంలో ఉంది. ఈ తరుణంలో పులివెందుల అసెంబ్లీ, కడప లోక్ సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే.. ఆ పార్టీకే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఒక వేళ ఉప ఎన్నికలలో పులివెందుల నుంచి అవినాష్ పోటీ చేసి ఓడిపోయినా, కడపలో జగన్ స్వయంగా పరాజయం పాలైనా ఇక జగన్ రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడినట్లే అవుతుంది.
నిజంగానే జగన్ పులివెందుల స్థానానికి, అవినాష్ రెడ్డి కడప లోక్ సభ స్థానానికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు తెరతీస్తే.. కడపలో జగన్ విజయం సంగతి ఎలా ఉన్నా పులివెందులలో అవినాష్ రెడ్డి విజయం సాధించడం మాత్రం అనుమానమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తాజా ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జగన్ కు మెజారిటీ తగ్గింది. ఇక్కడ తెలుగుదేశం తరపున బీటెక్ రవి రంగంలోకి దిగుతారు.
సీఎం హోదాలో పోటీలో ఉన్న జగన్ నే దీటుగా ఎదుర్కొన్న బీటెక్ రవికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అవినాష్ పై విజయం నల్లేరు మీద బండి నడకే అవుతుందని అంటున్నారు. ఇక కడప విషయంలోనూ తెలుగుదేశం అంత తేలిగ్గా తీసుకోదనీ, అవసరమైతే జగన్ ఓటమి లక్ష్యంగా ఉప ఎన్నికలో ఆయనకు ప్రత్యర్థిగా నిలిచే షర్మిలకు లోపాయికారీ మద్దతు ఇచ్చే అవకాశాలే మెండుగా ఉంటాయనీ చెబుతున్నారు. 2014-19 మధ్యలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కడప ఎమ్మెల్సీ ఎన్నికలో ఏం జరిగిందో పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే జగన్ చేజేతులా తన రాజకీయ జీవితానికి ముగింపు పలికినట్లేనని విశ్లేషిస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 11:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని బాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న రావుస్ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు పాల్గొని ప్రసంగించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ "ఎవరిని విడవకుండా ప్రతి ఒక్కరిని జన గణనలోకి తీసుకురావాలన్నది" ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవ నినాదమని తెలిపారు. డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ ప్రపంచ జనాభా నిరంతరం పెరుగుతున్నదని భూమి పెరగడం లేదని తద్వారా భవిష్యత్తులో అనేక సమస్యలకు దారితీస్తుందని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ జనాభా నియంత్రించి వనరులు అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో అధిక జనాభాని మానవ వనరులుగా అన్ని రంగాలలో వినియోగించుకుని దేశాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం కూడా ఉందని అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు.ఆఫ్నాన్,అమూల్య,అంజుం, వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా మేఘన, చంద్రిక ప్రోత్సాహక బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ళ నాగ రాజు,రావుస్ కళాశాల డైరెక్టర్ మౌని చంద్ర, ప్రిన్సిపల్ సుంకయ్య,లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా,జోన్ చైర్మన్ ఎలెక్ట్ సుధాకర్ రెడ్డి, సీనియర్ సభ్యులు కశెట్టి చంద్ర శేఖర్, పోసిన సుబ్బారావు, సుహస్ రాఘవ, కళాశాల బాలికలు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే..

## వాహనదారుల అవస్థలు


**రహదారి ప్రయాణం... ప్రమాద భరితం..!**



**ఆంధ్ర ప్రగతి మహానంది, జూలై 11:**
మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని మహాదేవపురం వెళ్లే రస్తాయందు చిన్నపాటి వర్షం కురిసిన రోడ్డు యందు వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది.రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతినిత్యం ఈ రహదారి నందు రాకపోకలు సాగించేటప్పుడు, అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. చినుకు పడితే బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా వృద్ధులు, విద్యార్థులు ప్రయాణం సాగించాలంటే నరకయాతన పడుతున్నారు.ఈ రహదారి బురదమయంగా తయారు కావడంతో, ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు విసుగేత్తిపోతున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా, ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.

## -ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం




**ఆంధ్ర ప్రగతి మహానంది, జూలై 11:** దేశ ప్రగతి అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక స్వాలంభణ లక్ష్యాల సాధన మనందరి బాధ్యతని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీహెచ్వో హుస్సేన్ రెడ్డి అన్నారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ప్రపంచ జనాభా దినోత్సవ కార్యాక్రమాన్ని తిమ్మాపురం ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్వో హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక జనాభా వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు దుర్భరంగా తయారవుతాయని, ఎక్కువ మంది పిల్లలు ఉంటే లాభాల కన్నా నష్టాలే ఎక్కువని తెలియజేశారు. అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం మేమిద్దరం మాకు ఒక్కరు అని,దేశాభివృద్ధికి కుటుంబ నియంత్రణ పాటిద్దాం బిడ్డకు మధ్య ఎడం పాటిద్దాం అని,జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధం అధిక జనాభా పెరుగుదల నష్టాల గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:
నంద్యాల జిల్లాలోని గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా వ్యాప్తంగా నాలుగు నుండి ఐదు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని పెండింగ్ వేతనాలు వెంటనే వేతనాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజు గ్రామాని శుభ్రం చేస్తూ పర్యావరణాన్ని కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తూ నిత్యం సేవలు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు రాక కుటుంబాల జరగడం చాలా కష్టంగా ఉందని వారన్నారు. పనులు చెప్పే అధికారులు ప్రజాప్రతి నిధులు వారి జీతాల గురించి గానీ వారి కుటుంబాల కోసం గురించి గానీ పట్టించుకోవడం లేదు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న నేటికీ కనీస వేతనం అమలు చేసే దిక్కులేదు. ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం లేదు ఉద్యోగ భద్రత లేదు రోజురోజుకు పెరుగుతున్న ధరలతో చాలీచాలని




వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరమైన బాదలను అధిగమించి పనిచేస్తున్నాం. అలాంటి కార్మికుల పట్ల వారి సంక్షేమ పట్ల చిత్తశుద్ధితో పని చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు స్వచ్ఛభారత్ కార్మికులకు డబ్బులు నూనె డ్రస్సు చీపుర్లు చెప్పులు ఇవ్వాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు దాదాపుగా 20 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి వేతనాలు అడిగితే బెదిరింపులు చేస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు14. 15 ఫైనాన్స్ నిధులు వేతనాలు ఇవ్వాలని డిపిఓ గారు ఆదేశించిన ఏ మండలంలో గాని గ్రామపంచాయతీలో వేతనాలు ఇచ్చిన పరిస్థితి లేదు. కానీ నేడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం అక్రమంగా తొలగిస్తున్నారు. కార్మికులకు అండగా ఉంటామనివారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఇచ్చిన వాగ్దానం మరచి కార్మికులను తొలగిస్తున్నారు. పది సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులను తొలగించడం అన్యాయం అన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు సృష్టించి తమ వారికి ఇవ్వాలి కానీ ఉన్న వారిని తొలగించడం భావ్యం కాదని వారు అన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలకు పదివేల రూపాయలు వేతనం ఇస్తామని జీవో నెంబర్ 680 ఇచ్చారు 10సంవత్సరకావస్తున్న జీవో అమలు కావడం లేదు వెంటనే జీవో ను అమలు చేయాలి .స్వచ్ఛభారత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలిఅక్రమ తొలగింపులు ఆపాలని వారు కోరారు.

# రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ కొనసాగించాలని నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ సర్కిల్ నందు ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దక్క కుమార్ , జిల్లా అధ్యక్షుడు మధు కిరణ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దక్క కుమార్ , మధు కిరణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చేరుటకు డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. ఆ నోటిఫికేషన్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంభరించుకోవాలని. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ




కళాశాలలో ప్రవేశాలు కోసం బీకాం జనరల్ కోర్సును చాలామంది విద్యార్థులు చదవడానికి శ్రద్ధ చూపుతున్నారు అని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగిస్తున్నట్లు ప్రకటిస్తూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగిస్తున్నారు. అలా చేయడంవల్ల ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు లేక మూతపడుతున్నటువంటి పరిస్థితి ఆంధ్ర ప్రదేశ్ లో కనపడతుంది. ఈనెల 10వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుగుతున్న సందర్భంగా ఇప్పటికి ఆన్లైన్లో రిజర్వేషన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ ఆప్షన్ కనిపియడం లేదు అని విద్యార్థులు ఆలోచిస్తున్నారు . కానీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మాత్రం బీకం జనరల్ కోర్స్ సాక్ష్యం కనబడతా ఉంది.. కావున దీనిపైన తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని కోరుచున్నాము. ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సిలింగ్ మొదలవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోసం కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో పి ఎస్ ఎఫ్ నాయకులు మహేష్ , బన్నీ , ప్రశాంత్ , ఉదయ్ పాల్గొన్నారు.

# సాగునీటి హక్కులు, ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కృషి చేయండి

## -ఆళ్ళగడ్డ MLA అఖిలప్రియకు విజ్ఞప్తి చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి.

## -సానుకూలంగా స్పందించిన అఖిలప్రియ... ప్రభుత్వం దృష్టికి తీసుకెల్తానని హామీ..

ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూలై 11:
రాయలసీమ సమగ్రాభివృద్ధిలో కీలకమైన సాగునీటి హక్కుల పరిరక్షణ, ప్రాజెక్టుల సాధన లక్ష్యంగా కృషి చేయాలని ఆళ్ళగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియకు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.
ఆళ్ళగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియను ఆమె స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపిన బొజ్జా దశరథరామిరెడ్డి. ఈ సందర్భంగా రాయలసీమ సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన కీలక అంశాలను రాయలసీమ ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయే కార్యక్రమంలో భాగంగా రాయలసీమ అభివృద్ధికి చేపట్టవలసిన సమగ్ర సమాచారంతో కూడిన పత్రాన్ని సమితి నాయకులు అందచేసారు.
రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు సమర్థవంతంగా పనిచేయడానికి శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన వివిధ చట్టబద్ధమైన




విధానపరమైన నిర్ణయాలు అమలు గురించి అఖిలప్రియకు బొజ్జా వివరించారు. శ్రీశైలం రిజర్వాయర్ కనీసం నీటి మట్టం 854 అడుగులు గా రూల్ కర్వ్, విద్యుత్ ఉత్పత్తికి నాగార్జునసాగర్ కు కేటాయించిన 264 టి ఎం సీ లకు లోబడే విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాల అమలు అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. శ్రీశైలం ప్రాజెక్టులో పూడిక నివారణకు సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని ఆ దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వం 365 జీ వో ద్వారా రాయలసీమలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన 102 ప్యాకేజీలను అర్ధాంతరంగా నిలుపుదల చేయడంతో రాయలసీమలోని వివిధ ప్రాజెక్టులకు జరిగిన నష్టాన్ని అఖిలప్రియకు వివరించారు. ఈ జీవో తో గోరుకల్లు రిజర్వాయర్ కు సంబంధించిన కీలకమైన నిర్మాణాలు ఆగిపోవడంతో, ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. కెసి కెనాల్ పరిరక్షణకే గాకుండా లక్షలాది ప్రజల త్రాగునీటి సమస్యను గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం ద్వారా తీర్చవచ్చని రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా కృషి చేయాలని కోరారు.కృష్ణా జలాలలో అత్యంత కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు వున్న కర్నూలు జిల్లాలోనే కె ఆర్ ఎం బి ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర విభజన చట్టం కల్పించిన హక్కులు, ఎన్ డి ఎ కూటమి 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రకటించిన హామీలు రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ, హైకోర్టు, విత్తన రాజదాని, హార్టీ కల్చర్ హబ్, మిషన్ రాయలసీమ, తదితర అంశాలను వివరిస్తూ వాటి అమలుకు కార్యాచరణ చేపట్టాలని కోరారు. సాగునీటి హక్కుల అంశాలపై శాసన సభ్యురాలు సానుకూలంగా స్పందిస్తూ గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, చట్టబద్ధమైన హక్కులు అమలు తదితర విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోతానని హామీ ఇచ్చారు. అఖిలప్రియను కలిసిన వారిలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, కార్యవర్గ సభ్యులు జాఫర్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# సబ్సిడీ ధరలకే బియ్యం, కంది పప్పు

## తొలి స్టాల్ ను ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

విజయవాడ ఆంధ్ర ప్రగతి జూలై 11:
నిత్యావసర సరకులను రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు రైతు బజార్లలో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్లో తొలి కౌంటర్ను నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పౌరసరఫరాలశాఖ, కృష్ణా జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో సామాన్యులకు నిత్యావసర సరకులను రాయితీపై అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ప్రజల కష్టాలు తీర్చేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హెూల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు సైతం 160 రూపాయలకే నాణ్యమైన కిలో కందిపప్పు,



తక్కువ ధరకే బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో పంచదార సహా పలు చిరుధాన్యాలనూ రైతు బజార్ల ద్వారా రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# గిరిజనులకు రక్షణ కల్పించండి

**-ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే గిరిజనులపై చిరుత పులి దాడి**
**-గిరిజన ప్రజా సమాఖ్యరాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:
చిరుత పులి బారి నుండి గిరిజనులకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ నంద్యాల జిల్లా కలెక్టర్ ను కోరారు.గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి మహానంది మండలంలో సంచరిస్తున్న చింతపల్లి విషయంపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో రాజు నాయక్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా మహానంది మండలంలోని ఎంతోమంది గిరిజనులకు చిరుత పులి దాడి చేయడం గిరిజన మానప్రాణాలను బలి తీసుకుంటుంది. ఈ మధ్యకాలంలోనే ఒకే నెలలో చిరుత పులి మహానంది సమీపంలో సంచరించడం జరుగుతుందని అటవీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన వారు నిర్లక్ష్యం చేస్తూ ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. వారు పట్టించుకోకపోవడంతో ఈ మధ్యకాలంలోనే ఒక గిరిజనుడు చిరుత పులికి బలయ్యాడు. మళ్లీ రెండు రోజుల కిందట చెంచు కమ్యూనిటీకి చెందిన నాగయ్య అనే గిరిజనుడి పై చిరుత దాడి చేసింది. అయినా అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో చిరుత పులి సంచరించడంతో కంటి మీద కునుకు లేకుండా గిరిజనులు నివసిస్తున్నారని అన్నారు. చిరుత ఎప్పుడొచ్చి దాడి చేస్తాధని భయంతో వణికి పోతున్నారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన గుడాలపై వాళ్ల స్థావరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, చిరుత పులి రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మహానంది మండలంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి చిరుత పులిని బంధించి తిరుపతి జూలో తరలించాలని అన్నారు. అదేవిధంగా అటవీ శాఖ అధికారులు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకొని గిరిజనుల ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ ని కోరారు.

# పనిచేయని 435 ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు.

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 11:
సార్వత్రిక ఎన్నికలకు కోసం వచ్చిన ఈవియంలలో పనిచేయని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను బెంగళూరుకు తరలిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.గురువారం టెక్కే మార్కెట్ యార్డ్ లో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పనిచేయని ఈవీఎంలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఏ పద్మజ, ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున రియాజ్ భాష, బిజెపి తరపున కె. చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి తరపున శివరాంరెడ్డి, వైసిపి తరపున సాయిరాం రెడ్డి, సిపిఎం తరపున నరసింహ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బెంగళూరు బెల్ కంపెనీ నుండి వచ్చిన ఈవీఎంలలో పనిచేయని ఈవీఎంలను బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సాంకేతిక లోప కారణంగా పనిచేయని ఈవీఎంలు, రిజర్వ్ లో ఉన్న ఈవీఎంలు, ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, మాక్ పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, కమీషనింగ్ లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, ఫస్ట్ లెవెల్ చెక్ లో పనిచేయని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్ లు మొత్తం కలిపి 435 ఈవీఎంలను గుర్తించామని వీటన్నింటినీ స్కాన్ చేసి ఈనెల 22 న బెల్ కంపెనీ, బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు
# నిత్యావసర సరుకులు పంపిణీ

**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 11:
నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతు బజార్లలో సోనామసూరి బియ్యము, కందిపప్పు ధాన్యాలను సరసమైన ధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.గురువారం పద్మావతి నగర్ లోని రైతు బజారు, టెక్కె మార్కెట్ యార్డులోని రైతు బజారు లలో నంద్యాల జిల్లా హెూల్సేల్ మండి మర్చంట్ అసోసియేషన్ సౌజన్యంతో నాణ్యమైన సార్టెక్స్ కందిపప్పు, కర్నూలు సోనా మసూరి బియ్యాన్ని సరసమైన ధరలకు విక్రయించే ప్రత్యేక కౌంటర్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి లు ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర వస్తువులు అధికంగా ఉన్న నేపథ్యంలో రైతు బజార్లో ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించి సోనా మసూరి బియ్యం, కందిపప్పులను సరసమైన ధరలకు అందివ్వాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు దేశ వాలి రకం కందిపప్పు కిలో 160 రూపాయలు, స్టీమ్డ్ సోనామసూరి బియ్యం కిలో 49 రూపాయలు, సోనా మసూరి రా బియ్యం కిలో 48 రూపాయలు చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. రైతు బజార్ లోని కౌంటర్లలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు వినియోగదారుల సౌకర్యం విక్రయిస్తామన్నారు. నంద్యాల పట్టణంలోని రెండు కేంద్రాలతో పాటు ఆత్మకూరు, డోన్, ఆళ్లగడ్డ పట్టణాలలోని రైతు బజార్లో కూడా ప్రత్యేక కౌంటర్లు ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక కేజీ కందిపప్పు, ఐదు కేజీల బియ్యం కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. జిల్లాలోని వినియోగదారులందరూ తమ ఆధార్ కార్డు తో పాటు క్యారీ బ్యాగ్ తీసుకొని కౌంటర్లలో నిత్యవసర సరుకులులు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.
ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకట రాముడు, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి, రైస్ మిల్, దాల్మిల్, రిటైలర్లు, హెూల్సేల్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఆధారాలు లేకుండా ఎలా రాస్తారు.?

**-డెక్కన్ క్రానికల్ వ్యవహారంపై విశాఖ ఎంపీ భరత్ ఆగ్రహం.**
**-డెక్కన్ క్రానికల్ ది బాధ్యతా రాహిత్యం అంటూ భరత్ విమర్శలు.**




ఆంధ్ర ప్రగతి విశాఖపట్నం జులై 11:
విశాఖ స్టీల్ ప్లాంట్ పై డెక్కన్ క్రానికల్ పత్రికలో వచ్చిన కథనం వివాదాస్పదంగా మారింది. దీనిపై టీడీపీ విద్యార్థి సంఘం, తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం కార్యకర్తలు డెక్కన్ క్రానికల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ వ్యవహారంపై విశాఖ టీడీపీ ఎంపీ భరత్ స్పందించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కథనాలు రాయడం సరికాదని డెక్కన్ క్రానికల్ పత్రికకు భరత్ హితవు పలికారు. "చంద్రబాబు కానీ, ఇక్కడి ఎంపీగా నేను కానీ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కానీ, ఎమ్మెల్యేలుగా పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్ కానీ ఎప్పుడైనా ఏమైనా అన్నారా? ఏ ఆధారం లేకుండా ఇంగ్లీషు మీడియా ఆ విధంగా రాయడం బాధ్యతా రాహిత్యం. ఇది చాలామంది జీవితాలతో ముడిపడిన అంశం. అలాంటి తీవ్రమైన విషయాన్ని ఏదో తేలిగ్గా రాసేయడం అంత కరెక్ట్ కాదు. ఈ విధంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడంపై మేం చర్యలు తీసుకుంటాం" అని భరత్ స్పష్టం చేశారు.

# ఉపాధి కూలీలకు..
# ఉపాధి చూపేది ఎవరు..?

## ఉపాధి పనులు లేకపాయే.?
## చేసిన పనులకు వేతనాలు లేకపాయే.?



**పోషణ భారమైంది అంటున్న పేద మధ్యతరగతి కుటుంబాలు..!**
**ఆర్థిక భారం తప్పదు అంటున్న అన్నదాతలు..!**
**నూతన కలెక్టర్ రాకతో ఉపాధి పనులు వచ్చేనా...?**

**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు జూలై 11:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా కుటుంబ పోషణకు తోడుగా నిలుస్తుంది. ఎన్నో సంవత్సరాల నుండి తప్పనిసరిగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రతి కుటుంబానికి 100 కూలీలు ఉండేలా ఉపాధి పనులు ఉండేవి. తద్వారా ప్రతి కుటుంబానికి దాదాపుగా 25 వేల రూపాయలు ఉపాధి వేతనాల ద్వారా లబ్ధి చేకూరడం వల్ల పోషణ భారం తగ్గేది. అంతేకాకుండా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వ్యవసాయం చేసుకునే అన్నదాతలకు కూడా పంట కాలువలు చేయడం వల్ల ఆర్థిక భారం తగ్గి వ్యవసాయానికి ఆసరాగా ఈ పనులు ఉండేవి. కానీ ఈ సంవత్సరం మాత్రం నూతన ఉపాధి పనులు మంజూరు కాకపోవడంతో ఉపాధి పనులు లేక ఉపాధి కూలీలు ఇతర మండలాలకు వలసలు వెళుతున్నారు. కొన్ని మండలాల్లో పూర్తిగా పనులు లేకపోవడంతో ఉపాధి పనులు లేక పేద మధ్యతరగతి కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ వ్యవసాయానికి పనికొచ్చే పంట కాలువలు కూడా చేయకపోవడంతో ఆర్థిక భారం తప్పదా అని అన్నదాతలు అందువలన చెందుతున్నారు. ఈ సంవత్సరం కల్పించిన అరకొర ఉపాధి పనులకు వెళ్లిన ఉపాధి కూలీలకు ఇంతవరకు ఉపాధి వేతనాలు కూడా అందకపోవడంతో వారి జీవనస్థితి అతలాకుతలం అయిపోయింది. మొదట ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని పనులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెప్పుకొచ్చారు. జిల్లాలో ఉపాధి కూలీల అవస్థలను, ఉపాధి పనులు కల్పించాలన్న విషయాన్ని జిల్లా అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంలో విఫలమయ్యారు. మొన్నటి వరకు నా కలెక్టర్ శ్రీనివాసులు నూతన పనులు మంజూరు చేస్తారేమోనని జిల్లాలోని ఉపాధి కూలీలందరూ, అన్నదాతలు ఎంతో ఆశగా ఎదురు చూసిన ఫలితం లేకపోయింది. అంతేకాకుండా చేసిన పనులకు గత రెండు నెలలుగా ఉపాధి వేతనాలు ఎందుకు రావడం లేదో అధికారులను అడుగుతున్న సమాధానం లేకపోవడంతో ఉపాధి కూలీలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం నంద్యాల నూతన జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారి ఉపాధి పనులపై దృష్టి సారించి నూతన ఉపాధి పనులను కల్పించి ఒకవైపు ఉపాధి కూలీలకు ఉపాధినిచ్చి, మరోవైపు అన్నదాతలను ఆదుకోవాలని ఉపాధి కూలీలు అన్నదాతలు కోరుతున్నారు.

# పర్సనల్ మెయిల్ ఐడీని ప్రకటించిన లోకేశ్..

**వినతులు ఆ మెయిల్ ఐడీకి పంపాలని విన్నపం**




విజయవాడ ఆంధ్ర ప్రగతి జూలై 11:సమస్య ఏదైనా, సహాయం కావాలన్నా ఇకనుంచి తనకు hello.lokesh@ap.gov.in మెయిల్ ఐడీకి పంపాలని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంపుతున్న మెసేజ్‌లు పోటెత్తడంతో మంత్రి నారా లోకేశ్ వాట్సాప్ ను 'మెటా' బ్లాక్ చేసింది. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న మంత్రి లోకేశ్ వాట్సాప్ బ్లాక్ కావడం, తరచూ ఇదే సమస్య ఉత్పన్నం అవుతుండటంతో తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in%కి ప్రజలు తమ వినతులు, సమస్యలు పంపించాలని ఒక ప్రకటనలో కోరారు.సాయం కోసం వచ్చే ప్రజలకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎన్నికలకు ముందే నారా లోకేశ్ ప్రకటించారు. ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రతిరోజు ప్రజల్ని కలిసి వారి సమస్యలు తెలుసుకునే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో తన వాట్సాప్‌కి వచ్చిన మెసేజ్ కు రియాక్ట్ అయ్యి 25 మంది దివ్యాంగ విద్యార్థుల సమస్య పరిష్కరించారు. వేలాది మంది తమ సమస్యలను ఒకేసారి మంత్రి నారా లోకేశ్ కి వాట్సాప్ చెయ్యడం వల్ల టెక్నికల్ సమస్యతో బ్లాక్ అయింది. తనకు సమాచారం పంపే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తానే హ్యాండిల్ చేసే పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in కి సమస్యలను పంపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.పాదయాత్రలో యువతకు తనను దగ్గరగా చేర్చిన "హలో లోకేశ్" కార్యక్రమం పేరుతోనే ఈ మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకున్న మంత్రి... తానే అందరి సమస్యలు నేరుగా అడ్రస్ చేస్తానని ప్రకటించారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య-సహాయంకు సంబంధించిన పూర్తి వివరాలు వినతులలో పొందుపరచాలని సూచించారు. మెయిల్ చేస్తే తాను స్పందిస్తానని తెలియజేశారు. వాట్సాప్ తరచూ బ్లాక్ కావడంతో ప్రజలు పంపే మెసేజ్ లు చూసే అవకాశం ఉండటం లేదని, దయచేసి అందరూ మెయిల్ ఐడీకే వినతులు పంపించాలని మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.